బతుకమ్మ సంబరం ఆరంభం



జహీరాబాద్‌లోని ప్రైవేటు డిగ్రీ కళాశాలలో..



మహబూబ్‌సాగర్ కట్టపై బతుకమ్మ ఆడుతున్న మహిళలు

బతుకమ్మ ఉత్సవాలు బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా ప్రారంభమయ్యాయి. మహిళలు తీరొక్క పూలను సేకరించారు. అందంగా పేర్చారు. వాటిని ఇళ్లముందు, ఆలయాల వద్ద, చెరువు కట్టలపై ఉంచి సామూహికంగా ఆడిపాడారు. జహీరాబాద్‌లోని ప్రైవేటు డిగ్రీ కళాశాలలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. –న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, జహీరాబాద్.

నేటి నుంచి దేవీ శరన్నవరాత్రులు



గుమ్మడిదలలో కల్యాణ వేంకటేశ్వర ఆలయానికి విద్యుత్తు దీపాలంకరణ



ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో భవానీమాత

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు జిల్లాలోని అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. గుమ్మడిదలలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభం కానున్నాయి. సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేటలోని సప్త ప్రాకారయుత భవానీమాత ఆలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. –న్యూస్‌టుడే, గుమ్మడిదల, సంగారెడ్డి గ్రామీణ.

పల్లె రోడ్లకు గ్రహణం

న్యూస్‌టుడే ప్రత్యేక పరిశీలన

పీఆర్ పరిధి సీసీ పనుల్లో తాత్సారం

గ్రామీణ ప్రాంతంలో మట్టి దారులను సిమెంట్-కాంక్రీట్(సీసీ)గా మార్చేందుకు ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.కోట్ల నిధులు మంజూరు చేసింది. పంచాయతీరాజ్ శాఖకు పనుల పర్యవేక్షణ బాధ్యతను అప్పగించారు. రోడ్లు బాగుపడతాయని పల్లెవాసులు ఆనందం వ్యక్తం చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ.. క్షేత్ర స్థాయిలో పనుల్లో కదలిక లేకపోవడంతో నిర్దేశిత లక్ష్యం నెరవేరడం లేదు. సకాలంలో బిల్లులు రావడం లేదనే కారణంతో గుత్తేదారులు పల్లె రోడ్ల నిర్మాణాలపై ఆసక్తి చూపడం లేదనే విమర్శలూ ఉన్నాయి.

రూ.85.25 కోట్లు మంజూరు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2023-24 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 1,118 సీసీ పనులకు రూ. 85.25 కోట్లు మంజూరు చేశారు. వీటిలో ఒక్కో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు నిధులు కేటాయించారు. రూ.5 లక్షల లోపు పనులు నామినేషన్ పద్ధతిపై, అంతకు మించితే టెండర్లు పిలిచారు.



ఇంద్రకరణ్‌లో సీసీ దారి నిర్మించాల్సిన ప్రాంతం

భారీగా బిల్లుల బకాయిలు: పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా 2022-23 ఆర్థిక సంవత్సరం చేపట్టిన పనులకు సంబంధించి రూ.61.33 కోట్ల బిల్లులు అపరిష్కృతంగా ఉన్నాయి. ఆయా బిల్లుల కోసం గుత్తేదారులు ఎదురుచూస్తున్నారు. 2023-24కు సంబంధించిన రూ.36.54 కోట్ల బిల్లులు సైతం చెల్లించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో గుత్తేదారులు కొత్త పనులు చేపట్టడానికి ముందుకు రావడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

క్షేత్ర స్థాయి పరిస్థితి

- కందిలో రూ.30 లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఇంద్రకరణ్, చెర్లగూడెం, ఎర్దనూర్, జుల్కల్ తదితర గ్రామాలను ఎంపిక చేశారు. ఈ మండల పరిధిలో ఎక్కడా పనుల్లో కదలిక లేదు.
- సంగారెడ్డి మండలం కల్పగూర్, ఇస్మాయిల్‌ఖాన్‌పేట, కొత్లాపూర్, నాగపూర్, ఇర్గిపల్లి, తాళ్లపల్లిలో రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు నిధులతో రోడ్లు వేయాల్సి ఉండగా.. పనుల్లో ఎలాంటి ప్రగతి లేదు.
- కొండాపూర్ మండలం గారకుర్తి, సీహెచ్ కోనాపూర్‌తో పాటు జిల్లాలోని చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. జిల్లాలో 293 పనులు అపరిష్కృతంగా ఉన్నాయి. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

వేగవంతం చేస్తాం

జిల్లాలో పీఆర్ పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటాం. పెండింగ్ బిల్లులు మంజూరవుతున్నాయి. ఎక్కడైనా పనులు ఆరంభించకుంటే ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. పనులు వేగవంతం చేసి.. బిల్లుల సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటాం. –జగదీశ్వర్, పీఆర్ ఎస్ఈ.

పనుల ప్రగతి ఇలా..	మంజూరు అయినవి	నిధుల అంచనా:	ఇప్పటి వరకు వ్యయం:	బిల్లుల బకాయిలు:	పూర్తయిన పనులు:	వివిధ దశల్లో ఉన్నవి:	ఇంకా ఆరంభించనివి:
	1,118	రూ.85.25 కోట్లు	రూ.48.71 కోట్లు	రూ.36.54 కోట్లు	698	127	293

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్ (ఇస్మాయిల్‌ఖాన్‌పేట), కంది(ఇంద్రకరణ్).

హైడ్రా నిబంధనలపై..
అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయండి: ఎంపీ



రోడ్డు శుభ్రం చేస్తున్న ఎంపీ రఘునందన్‌రావు, భాజపా జిల్లా అధ్యక్షురాలు గోదావరి

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: హైడ్రా నిబంధనలపై మరింత స్పష్టత ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం అఖిల పక్ష సమావేశం నిర్వహించాలని మెదక్ ఎంపీ ఎం.రఘునందన్ రావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన సంగారెడ్డిలో పర్యటించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలోనే హైడ్రాపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయని ఆరోపించారు. పదేళ్ల అధికారంలో ఉన్న భారాస బుల్డోజర్లతో నిర్మాణాలను కూలగొట్టి.. పేదలను ఖాళీ చేయించిన విషయాన్ని మర్చిపోయి.. ఆరోపణలు చేస్తోందని విమర్శించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో బుల్డోజర్లు అంటూ వంకర మాటలు వద్దని... అక్కడ నిబంధనల ప్రకారమే చర్యలు తీసుకుంటున్నారన్నారు. మల్లన్నసాగర్ పాత ఘటనలపై ఇప్పుడు కాంగ్రెస్ ఆరోపణలు చేయడం వల్ల ఎలాంటి ఫలితం ఉండదన్నారు. మంత్రి కొండా సురేఖపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరంగా పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని దుబ్బాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అనంతరం సంగారెడ్డి పట్టణంలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్, పార్టీ జిల్లా అధ్యక్షురాలు సి.గోదావరి, నాయకులు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, వెంకట్ నర్సింహారెడ్డి, పోచారం రాములు, డాక్టర్ రాజుగౌడ్ తదితరులు వెంట ఉన్నారు.

మహిళా సాధికారతకు ప్రభుత్వ పథకాలు



మాట్లాడుతున్న లోకాయుక్త జస్టిస్ రాములు

జహీరాబాద్, న్యూస్‌టుడే: మహిళా సాధికారికతకు ప్రభుత్వం తీసుకొస్తున్న అనేక పథకాలు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ లోకాయుక్త, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ పీవీ రాములు పేర్కొన్నారు. వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జ్ అండ్ సర్వీసెస్(వికాస్) ఆధ్వర్యంలో బుధవారం జహీరాబాద్‌లో ఏర్పాటు చేసిన 'మహిళా స్వశక్తికరణ- నైపుణ్యాభివృద్ధి' శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మారుమూల ప్రాంతంలోని మహిళలకు ఉచిత శిక్షణకు కృషి చేస్తున్న వికాస్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ఏపీ ప్రొడక్టివిటీ కౌన్సిల్ కార్యదర్శి రాజగోపాల్‌రెడ్డి, ప్రాజెక్టు కోఆర్డినేటర్ సురేందర్ రెడ్డి, సహాయ కోఆర్డినేటర్ రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి



ఎస్పీ కార్యాలయంలో అదనపు ఎస్పీ సంజీవరావు



నివాళి అర్పిస్తున్న టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, నాయకులు

మహాత్ముడి స్మరణం

మహాత్మాగాంధీ జయంతి వేడుకలు బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. సంగారెడ్డిలోని జడ్పీ కార్యాలయం ఆవరణలో గాంధీ విగ్రహానికి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి జడ్పీ సీఈవో జానకిరెడ్డి, జడ్పీ ఉప సీఈవో స్వప్న తదితరులతో కలిసి నివాళి అర్పించారు. ఎస్పీ కార్యాలయంలో అదనపు ఎస్పీ సంజీవరావు, సంగారెడ్డి గంజ్‌మైదానంలో టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలారెడ్డి ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. దేశానికి మహాత్ముడు చేసిన సేవలను కొనియాడారు. జహీరాబాద్‌లో ఎమ్మెల్యే మాణిక్‌రావు గాంధీ విగ్రహానికి నివాళి అర్పించారు. కొండాపూర్‌లో గాంధీ విగ్రహానికి 1973 నుంచి నిత్య పూజలు చేస్తున్న అర్చకులు అడివయ్యస్వామి తన ఆనవాయితీని కొనసాగించారు.
–న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, సంగారెడ్డి మున్సిపాలిటీ, కొండాపూర్.



కొండాపూర్‌లో గాంధీ విగ్రహానికి పూజ చేస్తున్న అడివయ్యస్వామి

గాయపడిన హోంగార్డుకు కలెక్టర్, ఎస్పీ పరామర్శ

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: కొండాపూర్ మండలం మల్కాపూర్ శివారులోని పెద్దచెరువులో ఇటీవల అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్నప్పుడు రాయి తగిలి గాయపడి.. చికిత్స పొందుతున్న హోంగార్డు గోపాల్‌ను బుధవారం కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రూపేష్ హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. హోంగార్డు వైద్య ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుందన్నారు. మరో రెండు రోజుల్లో ఆయన ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యే అవకాశం ఉందన్నారు. జిల్లా వైద్యాధికారిణి గాయత్రీదేవి, ఏఐజీ ఆసుపత్రి వైద్యులు వెంట ఉన్నారు.

నేడు డప్పూర్‌లో భారాస రచ్చబండ

జహీరాబాద్ అర్బన్(న్యాల్‌కల్): న్యాల్‌కల్ మండలం డప్పూర్, మల్గి, వడ్డి గ్రామాల్లో ఫార్మాసిటీకి భూసేకరణను వ్యతిరేకిస్తున్న రైతులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా భారాస రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. డప్పూర్‌లో గురువారం నిర్వహించే రచ్చబండ, రైతులతో ముఖాముఖి కార్యక్రమానికి మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సునీతాలక్ష్మారెడ్డి, డీసీఎంఎస్ ఛైర్మన్ శివకుమార్, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, క్రాంతి కిరణ్ తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు. సాగు భూములను ఫార్మాసిటీకి అప్పగించడం సరికాదని పేర్కొన్నారు.

మహిళా సంఘాలకు ప్రభుత్వ కానుక

జిల్లాకు 3.82 లక్షల చీరలు అవసరం



న్యూస్‌టుడే, నారాయణఖేడ్ టౌన్, జహీరాబాద్ అర్బన్: 'బతుకమ్మ చీరల పథకాన్ని రద్దు చేశాం. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు ఏటా రెండు చీరలు అందిస్తామని..' ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇందుకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. అవసరమయ్యే నిధులు, తయారీ విధానం, లబ్ధిదారుల ఎంపిక విధానాన్ని తెలియజేయాల్సిందిగా ప్రభుత్వం పేదరిక నిర్మూలన సంస్థ అధికారుల నుంచి సమాచారం కోరింది.

1.91 లక్షల మంది సభ్యులు

జిల్లాలో 18,203 మహిళా పొదుపు సంఘాలు ఉన్నాయి. వీటిలో 1.91 లక్షల మంది మహిళలు సభ్యులుగా కొనసాగుతున్నారు. ఒక్కొక్కరికి రెండు చీరలు పంపిణీ చేయాలంటే 3.82 లక్షల చీరలు అవసరమవుతాయి. జిల్లాలో జోగిపేట, నారాయణఖేడ్, హన్మంతురావుపేటలో చేనేత సహకార సంఘాలు ఉన్నాయి. ఇందులో 105 మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరి ద్వారానే జిల్లాకు అవసరమైన 3.82 లక్షల చీరలు తయారు చేయాలి. ఇది సాధ్యమయ్యే అవకాశం లేకపోవడంతో మరమగ్గాల సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఇప్పటికిప్పుడు పంపిణీ కష్టమే..

గత ప్రభుత్వం రేషన్ కార్డు ఆధారంగా బతుకమ్మ చీరలను పంపిణీ చేసింది. 18 ఏళ్లు నిండిన యువతులు, మహిళలకు ఒక్కో చీర చొప్పున అందజేశారు. ఈ పథకాన్ని రద్దు చేసిన నేపథ్యంలో మహిళా సంఘాలకు చీరలు పంపిణీ చేయనున్నారు. వీరికి ఇప్పటికిప్పుడు చీరలు నేయించి ఇవ్వడం సాధ్యం కాదు. దీంతో వచ్చే ఉగాది నాటికి చీరల్ని సిద్ధం చేసి పండగ సందర్భంగా అందజేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. చీరల తయారీకి గతంలో చేనేత, జౌళిశాఖ నిధులను వెచ్చించేవారు. ఇప్పుడు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్ని భాగస్వాముల్ని చేయాలని నిర్ణయించారు.

సింగూరు నీటి విడుదల

పుల్కల్, న్యూస్‌టుడే: మండల పరిధిలోని సింగూరు ప్రాజెక్టుకు వరద ప్రవాహం పెరగడంతో బుధవారం ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. గత నెలలోనే జలాశయం పూర్తి నీటి నిల్వ సామర్థ్యాన్ని చేరుకుంది. అప్పటి నుంచి విద్యుదుత్పత్తి కొనసాగుతోంది. ఇన్‌ఫ్లో 7263 క్యూసెక్కులు కాగా.. అవుట్ ఫ్లో 13,556 క్యూసెక్కులు. ప్రాజెక్టు వద్ద అప్రమత్తంగా ఉంటూ వరదను ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నామని ఏఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు. నది పరీవాహక ప్రాంత రైతులు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన షురూ

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: స్థానిక శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో డీఎస్సీ-2024 అభ్యర్థుల ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు కౌంటర్లను పరిశీలించారు. మొత్తం 771 మందికి 251 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 33 కౌంటర్ల ద్వారా పరిశీలిస్తున్నట్లు డీఈవో తెలిపారు. ఈ నెల 5వ తేదీ వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఏడీ శంకర్, జిల్లా నోడల్ అధికారి లింబాజీ, సీనియర్ ప్రధానోపాధ్యాయులు నాగభూషణం పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వర్గల్, న్యూస్‌టుడే: ఉమ్మడి మెదక్ జిల్లాలోని వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతుల్లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డి.రాజేందర్ పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో వర్గల్ నవోదయలో ఖాళీగా ఉన్న సీట్లలో చేరేందుకు దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. తొమ్మిదో తరగతిలో చేరేందుకు ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు, 11లో చేరేందుకు ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్లైన్ shttps:-///www.navodaya.gov.inzలో ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2025, ఫిబ్రవరి 8న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఏడుగురు గంజాయి విక్రేతల అరెస్టు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: గంజాయి దమ్ము పీల్చుతూ జల్సాలకు అలవాటై దానిని ఇతరులకు అమ్ముతున్న యువకుడు పోలీసులకు పట్టుబడ్డాడు. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాలు.. పట్టణంలోని కేసీఆర్‌నగర్‌కు చెందిన శశివర్ధన్, షాదుల్, నివాస్, వారి స్నేహితులతో కలిసి విశాఖపట్నంలో ఓ వ్యక్తి వద్ద గంజాయి కొంటున్నారు. గంజాయిని బుధవారం సిద్దిపేటలోని కేసీఆర్‌నగర్‌లో విక్రయించే క్రమంలో పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. ఈ క్రమంలో శశివర్ధన్‌ను అదుపులోకి తీసుకున్నారు. షాదుల్, నివాస్ పరారయ్యారు. స్నేహితులు సురేశ్, రఘువంశీ, దయాకర్, లక్ష్మణ్, చాంద్‌పాషా, రోహిత్‌లను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 1040 గ్రాముల ఎండు గంజాయి, ఒక కారు స్వాధీనం చేసుకున్నారు.

దేవీ శరణం గచ్ఛామి

నేటి నుంచి శరన్నవరాత్రులు ప్రారంభం

ఆధ్యాత్మిక శక్తి.. ప్రపంచాన్ని ముందడుగు వేసేలా చేస్తోంది. శక్తికి మరోపేరు అమ్మవారు. అమ్మవారిని ఏకాగ్రచిత్తంతో ఆరాధిస్తే ధైర్యం లభిస్తుంది. మంచి పనులకు మనసును పురిగొల్పుతుంది. నేటి నుంచి దశమి వరకు శరన్నవరాత్రోత్సవాల్లో దుర్గామాత, సరస్వతి మాత క్షేత్రాల్లో రోజుకో రకంగా దివ్యమైన పూజలు జరుగుతాయి. భక్తులు దీక్ష తీసుకొని మాత విగ్రహాన్ని ప్రతిష్ఠించి అర్చిస్తారు. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాలోని ముఖ్య ఆలయాలు, మండపాలు వాటి ప్రత్యేకతలపై కథనం.



చిట్కుల్‌లో చాముండేశ్వరి

శాంతస్వరూపిణి

చిలప్‌చెడ్: మంజీరా నదీ తీరంలో చాముండేశ్వరిదేవి గుడి వెలిసింది. మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ గ్రామంలో శాంతిస్వరూపిణిగా చాముండి దర్శనం ఇవ్వడం విశేషం. నేడు మొదటి రోజున వేయి కడవల నది నీటితో అభిషేకిస్తారు. నిత్యం పారాయణాలు నిర్వహిస్తారు.

మహిళలే ముందుకు..

తూప్రాన్, న్యూస్‌టుడే: మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో కులాలతో సంబంధం లేకుండా సమష్టిగా ఉత్సవాల నిర్వహణ ఇక్కడి ప్రత్యేకత. నిమజ్జనం రోజు ప్రధాన వీధుల్లో భాగస్వాములై కోలాటంతో శోభాయాత్ర చేపడతారు. మహంకాళి దేవాలయ ఆవరణంలో 26 సంవత్సరాలుగా నవరాత్రోత్సవాలు నిర్వహిస్తున్నారు. 90 మంది భక్తులు దీక్షలో ఉంటారు.



మహంకాళి మందిరం

గడికోట వైభవం

పెద్దశంకరంపేట: పెద్దశంకరంపేటలోని చారిత్రక శంకరమ్మ గడికోటను కొన్నేళ్ల క్రితం గ్రామస్థులు మరమ్మతులు చేసి వాడుకలోకి తెచ్చుకున్నారు. అందులోభాగంగా గడికోట ఉత్సవ సమితిగా ఏర్పడి నవరాత్రోత్సవాలను నిర్వహిస్తున్నారు. కోటలో అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. బోనాలు, ప్రస్తుత ఉత్సవాలతో ఈ కోట శిథిలం కాకుండా చారిత్రక సాక్ష్యంగా నిలిచింది.

తుంకిమెట్లలో పొయ్యి వెలగదు!

కొడంగల్, బొంరాస్‌పేట: వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట మండలం తుంకిమెట్ల గ్రామంలో రోజూ సామూహిక భోజనం ఉంటుంది. ఎవరింట్లోనూ వంటలు చేయరు. పదేళ్లుగా దుర్గామాత పూజల్లో ఆనవాయితీ ఇది. గ్రామంలో 1200 మంది జనాభా. నిమజ్జనం రోజు 300 మంది ఏకరూప దుస్తులతో విగ్రహాన్ని తరలిస్తారు.



పెద్దశంకరంపేటలోని గడికోట

అర్ధనారీశ్వరం విశేషం

న్యూస్‌టుడే, గజ్వేల్ గ్రామీణం: సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని సంతోషిమాత దేవాలయంలో నాలుగో రోజున అర్ధనారీశ్వరి అలంకరణ ఉమ్మడి జిల్లాలోనే పేరుగాంచింది. నేటి నుంచి వరుసగా బాలాత్రిపురసుందరి, మహాలక్ష్మి, రాజరాజేశ్వరి, అర్ధనారీశ్వరి, లలితాంబిక, అన్నపూర్ణ, సరస్వతి, దుర్గ, మహిషాసురమర్దిని, సంతోషిమాత అవతారాల్లో దర్శనం లభిస్తుంది.



గజ్వేల్ సంతోషిమాత

ఏడుపాయల్లో ఆధ్యాత్మిక పరవళ్లు

పాపన్నపేట, న్యూస్‌టుడే: మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గామాత ఆలయం ఉత్సవశోభను సంతరించుకుంది. సమీపంలోని గోకుల్ షెడ్‌లో అర్చనలు కొనసాగుతాయి. ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రతిష్ఠిస్తారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు నేడు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. అమ్మవారిని రోజూ వివిధ అవతారాల్లో భక్తులు దర్శించుకుంటారు. ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు. దసరా రోజు 15 వేల మందికి పైగా దర్శించుకుంటారు. ఏటా సింగూరు ప్రాజెక్టు నుంచి దిగువకు నీటి విడుదల ఉంటుంది. ఈ సమయంలో రాజగోపురంలోనే పూజలు జరుగుతున్నాయి. వనదుర్గా ప్రాజెక్టు నుంచి 8000 క్యూసెక్కుల వరద దిగువకు బుధవారం ప్రవహిస్తున్నట్లు ప్రాజెక్టు ఏఈ విజయ్ కుమార్ తెలిపారు. గురువారం ప్రవాహం మరింత పెరగనుందని ఆయన తెలియజేశారు.



వనదుర్గమ్మ

కమనీయ రూపాలు ›››

▼ మొదటి రోజు శైలపుత్రి ▼ రెండో .. బ్రహ్మచారిణి ▼ మూడో .. చంద్రఘంట ▼ నాలుగో .. కూష్మాండ ▼ ఐదో .. స్కంధమాత ▼ ఆరో .. కాత్యాయని ▼ ఏడో .. కాళరాత్రి ▼ ఎనిమిదో .. మహాగౌరి ▼ తొమ్మిదో .. సిద్ధిధాత్రి ▼ పదో .. రాజరాజేశ్వరి

గతేడాది వాహన పూజలు

ద్విచక్ర .. 100 | నాలుగు చక్రాలవి 50 | భారీవి .. 20

గతేడాది ప్రసాదాల విక్రయం

లడ్డూలు - 3000 పులిహోర - 2000

ప్రత్యేక పూజలు ›››

- రోజూ ఉదయం 9:30 గంటలకు అర్చనలు ప్రారంభం
- 6వ రోజున మూల నక్షత్రం సందర్భంగా మంగళవారం బోనాలు సమర్పిస్తారు.
- 9వ రోజున మహర్నవమి నేపథ్యంలో సువాసిని పూజ, చండీ హోమం నిర్వహిస్తారు.
- నిత్యం అన్నదానం చేపడతారు.

సరస్వతి నమస్తుభ్యం

వర్గల్, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా వర్గల్ సరస్వతి క్షేత్రంలో సరస్వతి నమస్తుభ్యం మంత్రోచ్చారణ మార్మోగనుంది. ఆలయ వ్యవస్థాపక ఛైర్మన్ యాయవరం చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. గురువారం కలశ స్థాపన జరుగుతుంది. 9న మూల నక్షత్రం సందర్భంగా పుష్పగిరి, రంగంపేట, శ్రీక్షేత్రం పీఠాధిపతులు అమ్మవారికి పూజలు నిర్వహించి అనుగ్రహ భాషణం చేయనున్నారు.



వర్గల్ విద్యాధరి

ఆలోచనకు పెద్దపీట



‘ఉపాయం వచ్చినోడు.. ఉపాసం ఉండడు’ ఈ సామెతను చిన్నారులు నిజం చేశారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం ఐనాపూర్‌లో బరువైన పెద్దపీటను కొందరు చిన్నారులు ఓవైపు మోస్తూ మరోవైపు భాగాన్ని సైకిల్‌పై పెట్టి తరలిస్తున్నారు. గణపతి వేడుకలు ముగిసి అమ్మవారి శరన్నవరాత్రోత్సవాల కోసం మండపాలు ఏర్పాటు చేశారు. అవసరానికి పీటను ఒకచోట నుంచి మరోచోటకు చేర్చడానికి చిన్నారులు ఇలా ఆలోచన చేశారు. స్థానికులు చూసి ‘భళా పిల్లలు.. భలే చేశారు’ అని మెచ్చుకున్నారు. **- న్యూస్‌టుడే, చేర్యాల**

స్టార్టప్‌తో ముందంజ

దుబ్బాక, సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: ప్రపంచంలో శాస్త్ర సాంకేతికత రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో నేడు చదువుకున్న యువత కొత్తగా ఆలోచిస్తున్నారు. ఉద్యోగాల వేట కంటే ఈతరానికి అనుగుణమైన వ్యాపారాలు చేపడుతున్నారు. ఆన్‌లైన్ షాపింగ్‌ల పేరుతో సరికొత్త స్టార్టప్ కంపెనీలు ప్రారంభిస్తూ సఫలమవుతున్నారు. అలాంటి కోవలోకి చెందిన వారు.. సిద్దిపేట జిల్లాకు చెందిన ఇద్దరు సోదరులు. దుబ్బాక పట్టణానికి చెందిన కిష్టమ్మగారి సందీప్‌రెడ్డి, సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లికి చెందిన నిమ్మ నిఖిల్‌రెడ్డి వరుసకు సోదరులు. వీరు రైతు కుటుంబాలకు చెందిన వారు. సందీప్‌రెడ్డి.. బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ చేశారు. నిఖిల్‌రెడ్డి ఎమ్మెస్సీ బోటనీ చదివారు. విద్యాభ్యాసం పూర్తయ్యాక వీరు భిన్నంగా ఆలోచించి, ఈ-కామర్స్ రంగంలో పోటీ పడాలనే ఆలోచన చేశారు. మూడు నెలల క్రితం హైదరాబాద్‌లోని సుచిత్ర కేంద్రంగా ‘బూకార్ట్ ట్రేడింగ్ స్టోర్స్’ (ఓపీసీ) ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని ప్రారంభించారు. దాదాపు రూ.12 లక్షల బ్యాంకు రుణంతో ప్రారంభించారు. వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ వేదిక ఏర్పాటు చేసి, షాపింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఫ్యాషన్ రంగానికి సంబంధించి దుస్తులు, చెప్పులు ఆర్డర్స్ ద్వారా చేయించి ఆన్‌లైన్‌లో పెడుతున్నారు. విక్రయించేందుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటివరకు 1500 ఆర్డర్లు వచ్చాయన్నారు. వినియోగదారుల ఆవసరాలకు అనుగుణంగా మరిన్ని వస్తువులను ఆన్‌లైన్ షాపింగ్‌లో అందుబాటులో ఉంచేందుకు ప్రయత్నిస్తున్నామని వారు చెప్పారు. కొద్ది రోజుల్లో కంపెనీ యాప్‌ను అందుబాటులోకి తేనున్నారు. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన వస్తువులను 3, 4 రోజుల్లో వివిధ కొరియర్ కంపెనీల ద్వారా వినియోగదారుల ఇంటికి పంపిస్తున్నారు. వస్తువులకు చెల్లింపులన్నీ ఆన్‌లైన్‌లో డెబిట్, క్రెడిట్, యూపీఐ ద్వారా చెల్లుబాటు అయ్యేట్లు అనుమతులు తీసుకున్నామని చెప్పారు. నాణ్యమైన వస్తువులను అందించే లక్ష్యంతో స్టార్టప్ కంపెనీ ప్రారంభించామని తెలిపారు. సొంత కాళ్లపై నిలబడి, తాము ఎదుగుతూ తమతోపాటు మరికొందరు యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో దీనిని ప్రారంభించామని.. విస్తరిస్తామని చెప్పారు. స్టార్టప్ కంపెనీలు ప్రారంభించాలనే ఆలోచన ఉన్నవారికి ఉచితంగా సూచనలు, సహకారం అందిస్తామంటున్నారు.



సందీప్‌రెడ్డి, నిఖిల్‌రెడ్డి

పూలవనం.. ఆనందమయం



వికారాబాద్ మండలంలోని తట్టేపల్లి వెళ్లే మార్గంలో ఓ రైతు పొలంలో కాశ పూలు, బంతి పూల తోట విశేషంగా చూపరులను ఆకట్టుకుంటోంది. వివిధ రంగులతో అలరిస్తూ బతుకమ్మల రూపకల్పనలో మారేందుకు సిద్ధమయ్యాయి. పరిసరాలను ఆహ్లాదకరంగా మార్చాయి. – న్యూస్‌టుడే, పెద్దేముల్

లారీని ఢీకొన్న స్కార్పియో.. ఒకరి దుర్మరణం

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై ఆగిఉన్న లారీని వెనుక నుంచి స్కార్పియో ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని మాడిగి సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... ముంబయి వైపు వెళ్తున్న స్కార్పియో వాహనం మొగుడంపల్లి మండలం మాడిగి సమీపంలో రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీని వేగంగా ఢీకొట్టింది. స్కార్పియోలో వెనుక కూర్చున్న హైదరాబాద్ టోలిచౌకికి చెందిన ఆబేద్ కుర్షిద్(50) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ప్రమాద ఘటనపై ఫిర్యాదు అందలేదని చిరాగ్‌పల్లి ఎస్సై రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు.



అతివల ఏకరూపం.. బతుకమ్మల సంబురం

తీరొక్క పూలు తెచ్చి ఆకర్షణీయంగా బతుకమ్మలను మహిళలు పేర్చారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు ఆడిపాడారు. సిద్దిపేట జిల్లా నంగునూరులోని బస్టాండు కాలనీ మహిళలు తాము ప్రత్యేకంగా నిలవాలనే ఉద్దేశంతో ఏకరూప చీరలు ధరించి బతుకమ్మ ఆడారు. – న్యూస్‌టుడే, నంగునూరు

భాస్కరయోగికి సాహిత్య పురస్కారం



పరిగి, న్యూస్‌టుడే: తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో ఏటా అందించే పురస్కారానికి ఆధ్యాత్మిక వేత్త, రచయిత, సామాజిక విశ్లేషకుడు పి.భాస్కరయోగి ఎంపికయ్యారు. వికారాబాద్ జిల్లా పరిగికి చెందిన ఆయనకు ఈనెల 4న హైదరాబాద్‌లోని దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో పాకాల యశోదారెడ్డి ధర్మనిధి పురస్కారం ప్రదానం చేయనున్నారు. తెలంగాణ సాహిత్య చరిత్రలో చోటు దక్కని 300 మంది వాగ్గేయకారుల కీర్తనలను, జీవితాలను ఆయన పరిశీలించి సాహిత్య లోకానికి ఆయన పరిచయం చేశారు. తెలంగాణ పద సంకీర్తనల పేరుతో సాహిత్య అకాడమీ ఆ పుస్తకాన్ని ప్రచురించింది. సాహిత్య సౌరభాలు పేరుతో ఆయన పరిశోధనాత్మక గ్రంథం వెలువడింది.

ఖైదీల్లో మార్పునకు జైళ్ల శాఖ కృషి

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: ఖైదీల్లో మార్పునకు జైళ్లశాఖ అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని ఆ శాఖ డీఐజీ డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా కందిలోని కేంద్ర కారాగారంలో ఖైదీల సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఖైదీలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో జైళ్ల శాఖ పెట్రోల్ బంకులు, పరిశ్రమలు నిర్వహిస్తోందని, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్, జైళ్ల శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఖైదీకి బహుమతి అందజేస్తున్న జైళ్ల శాఖ డీఐజీ శ్రీనివాస్

సంపులో పడి బాలుడి మృతి



రుద్రాన్ష్

చిన్నకోడూరు, న్యూస్‌టుడే: ఒక్కగానొక్క కొడుకు ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి కళ్లెదుటే మృత్యుఒడికి చేరడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ విషాదకర ఘటన చిన్నకోడూరు మండలంలోని మైలారం మధిర గ్రామం కమ్మర్లపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై బాలకృష్ణ, గ్రామస్థులు తెలిపిన వివరాలు.. కమ్మర్లపల్లికి చెందిన బైకని వేణు, రేణుక దంపతులకు ముగ్గురు కుమార్తెలు, మూడున్నరేళ్ల కుమారుడు రుద్రాన్ష్ ఉన్నారు. వారం రోజుల క్రితం వేణు తన ఇంటి ఆవరణలో సంపు నిర్మించి నీటితో నింపాడు. దాని పై కప్పు వేయలేదు. రుద్రాన్ష్ బుధవారం సాయంత్రం ఇంటి ఆవరణలో ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు సంపులో పడిపోయాడు. సుమారు గంట తర్వాత బాలుడు కనిపించడం లేదంటూ కుటుంబ సభ్యులు వెతకగా సంపులో పడి ఉన్నాడు. స్థానికుల సాయంతో బాలుడిని బయటకు తీసి చూసే సరికి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే ఓ సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలుడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్కేటింగ్‌లో ఇషాన్ ప్రతిభ



సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: హైదరాబాద్ బీహెచ్ఈఎల్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీల్లో సిద్దిపేట శ్రీసాయి స్కేటింగ్ అకాడమీకి చెందిన చిన్నారి కంచర్ల ఇషాన్ సత్తా చాటాడు. అండర్-7 విభాగంలో 500 మీటర్ల క్వాడ్ స్కేటింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈనెల 4వ తేదీ నుంచి భువనగిరిలో నిర్వహించే తెలంగాణ రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించాడని శిక్షకుడు సంపత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు యువజన క్రీడల శాఖ జిల్లా మేనేజర్ వెంకటేశ్వర్‌గౌడ్, సిద్దిపేట స్పోర్ట్స్ కన్వీనర్ పాల సాయిరాం, జిల్లా స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పిండి అరవింద్, ఉపాధ్యక్షుడు పల్లె చంద్రశేఖర్‌గౌడ్, కార్యదర్శి సంతోష్ ఇషాన్‌ను అభినందించారు.

ఆర్థిక ఇబ్బందులతో బలవన్మరణం



నరేష్

నిజాంపేట, రామాయంపేట, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన నిజాంపేటలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన దండు నరేష్(42) గతంలో దుబాయ్‌కి వెళ్లాడు. ఇటీవల ఇంటికి తిరిగివచ్చాడు. అప్పులు తీర్చలేక, స్థానికంగా పని దొరక్క మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 1న పురుగుమందు తాగాడు. కుటుంబసభ్యులు గాంధీ ఆసుపత్రికి తరలించగా అక్కడ పొందుతూ బుధవారం మృతి చెందాడు. నరేష్ భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నర్సు ఆత్మహత్య: శివ్వంపేట, న్యూస్‌టుడే: మెదక్ జిల్లా శివ్వంపేట మండలం దంతాన్‌పల్లిలో యువతి ఆత్మహత్య చేసుకుంది. శివ్వంపేట ఎస్సై మహిపాల్ రెడ్డి, గ్రామస్థులు తెలిపిన వివరాలు.. దంతాన్‌పల్లి గ్రామానికి చెందిన కుల్ల అంజలి(21) మేడ్చల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా చేస్తోంది. ఆమెకు తల్లి, సోదరుడు, ఇద్దరు అక్కలు ఉన్నారు. తండ్రి గతంలోనే మృతి చెందాడు. తల్లి కూలీ పనులు చేస్తుంటారు. నలుగురు సంతానంలో అంజలి అందరికంటే చిన్న. మంగళవారం దంతాన్‌పల్లిలో బహిర్భూమికి వెళ్లి తిరిగి రాలేదు. తల్లి సత్తమ్మ వెళ్లి చూడగా ఇంటి ముందున్న చెట్టుకు చున్నీతో ఉరి వేసుకొని కనిపించింది. యువతి మృతికి కారణాలు దర్యాప్తులో తెలుస్తాయని ఎస్సై చెప్పారు. ఆమె సోదరుడు ఆనంద్ ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది.



అంజలి

మంత్రాల నెపంతో కుటుంబ సభ్యులపై దాడి

రామాయంపేట, న్యూస్‌టుడే: మంత్రాల నెపంతో మహిళతో పాటు ఆమె కుటుంబ సభ్యులపై దాడి చేసిన ఘటన రామాయంపేట మండల పరిధి ప్రగతి ధర్మారంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై బాలరాజు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గుర్రం విజయ భర్త సిద్ధిరాములు అదే గ్రామానికి చెందిన పున్న చంద్రం ఇంటి వద్ద చెట్టు కింద నిమ్మకాయలు, పసుపు, కుంకుమ పెట్టి మంత్రాలు చేస్తున్నారని ఆగ్రహించి బుధవారం పది మంది విజయపై దాడి చేశారు. అడ్డు వచ్చిన భర్త సిద్ధిరాములు, వారి కుమారుడినీ కొట్టారు. అనంతరం వారిని చెట్టుకు కట్టేశారు. స్థానికులిచ్చిన సమాచారంతో పోలీసులు చేరుకొని వారిని కాపాడారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన పది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



నర్సింహులు

మెదక్ రూరల్, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన మెదక్ పట్టణం అవుసులపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామీణ ఠాణా ఏఎస్సై శివకుమార్ తెలిపిన ప్రకారం పట్టణానికి చెందిన బొయిని నర్సింహులు (55) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబ సభ్యులను పోషిస్తున్నాడు. బుధవారం పొలం గట్టుపై నడుస్తుండగా, కాలు జారడంతో పక్కనే ఉన్న విద్యుత్ నియంత్రిక సపోర్ట్ తీగను పట్టుకున్నాడు. అదే సమయంలో కరెంట్ సరఫరా అవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. నర్సింహులుకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. కుమారుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై చెప్పారు.

‘హ్యాండ్‌బాల్’కు విద్యార్థుల ఎంపిక

హుస్నాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు హుస్నాబాద్ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. 3 నుంచి 5 తేదీ వరకు నారాయణపేట జిల్లా కోస్గిలో పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగే అండర్-17 హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు తరఫున ఆడనున్నారు. పాఠశాలలో పదోతరగతి చదువుతున్న ఎం.శివబాలాజీ బాలుర విభాగంలో, కె.ప్రశాంత బాలికల విభాగంలో జిల్లా జట్టుకు ఎంపికయ్యారని పీడీ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వాసుదేవరెడ్డి, పూర్వాధ్యక్షురాలు రజిత, ఎంఈవో మనీలా అభినందించారు.



విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు వాసుదేవరెడ్డి

అనుమానాస్పద స్థితిలో యువకుడు...



మోహన్

టేక్మాల్, న్యూస్‌టుడే: వ్యవసాయ క్షేత్రం పక్కన ఉన్న గుంతలో పడి ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటన మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని ఎక్లాస్‌పూర్ శివారులో బుధవారం చోటుచేసుకుంది. ఏఎస్సై దయానంద్ తెలిపిన వివరాలు.. టేక్మాల్‌కు చెందిన బాజ మోహన్(29) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతంలో వెతికినా ఆచూకీ దొరకలేదు. బుధవారం ఉదయం పొలాల పక్కన గుంతలో పడి మృతి చెందిన విషయం స్థానికుల ద్వారా కుటుంబ సభ్యులకు తెలిసింది. రోడ్డు పక్కన మోహన్ ద్విచక్ర వాహనం నిలిపి ఉంది. వాహనంపై రక్తపు మరకలు ఉన్నాయి. కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య సునీత ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యోగా శిక్షణ.. ఆరోగ్య రక్షణ

న్యూస్‌టుడే, నర్సాపూర్: సంపూర్ణ ఆరోగ్యం.. మానసిక ప్రశాంతత.. యోగాతోనే సాధ్యం. సరైన సూచనలు, సలహాలు పాటిస్తూ సాధన చేస్తే ఒత్తిడిని జయించవచ్చని అంటున్నారు యోగా సాధకులు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో నిత్య జీవన యోగాసాధన సమితి ఆధ్వర్యంలో చేపడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పట్టణంలోని లయన్స్ క్లబ్ భవనం కేంద్రంగా చేసుకుని ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకూ సాధన చేస్తున్నారు. సుమారు 40 మంది క్రమం తప్పకుండా యోగాసానాలు వేస్తున్నారు. ఇటీవల నర్సాపూర్ అర్బన్ పార్కులోని వాచ్ టవర్ వద్ద యోగా శిబిరం చేపట్టారు. రాయరావు చెరువు కట్టపైనా ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ యోగా చేస్తున్నారు. వారంతా సాత్వికాహారం స్వీకరిస్తున్నారు. పట్టణంలో శాకాహార ర్యాలీలు చేపడుతూ అవగాహన కల్పిస్తున్నారు.

కేంద్రం ఏర్పాటుకు యత్నం

సమితి ఆధ్వర్యంలో నర్సాపూర్‌లో యోగా కేంద్రం ఏర్పాటుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. ఎకరం విస్తీర్ణంలో దీనిని ఏర్పాటు చేయాలనే ఆలోచన చేస్తున్నారు. ఇందుకు ప్రభుత్వ సహకారం తీసుకోవాలని యోచిస్తున్నారు. రాయరావు చెరువు కేంద్రంగా దీని ఏర్పాటుకు ప్రతిపాదనలు అధికారులకు అందించారు. అటవీ ప్రాంతానికి సమీపంలో నీటి వనరు వద్ద, చల్లని గాలులు, ప్రకృతి సహజ సిద్ధమైన వాతావరణంల నెలకొల్పే ఉద్దేశంతో కేంద్రం కోసం ప్రయత్నిస్తున్నారు.



నర్సాపూర్ చెరువు కట్టపై శిబిరం

గురువుగా విశ్రాంత ఉద్యోగి

శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామానికి చెందిన యోగా గురువు సురేందర్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో విశ్రాంత ఉద్యోగి. రెండు దశాబ్దాల నుంచి ఆసక్తిని పెంచుకున్నారు. వివిధ యోగా సంస్థల్లో ప్రత్యేక శిక్షణ పొందారు. ఉద్యోగ విరమణ అనంతరం యోగా గురువుగా ఆయన తన ప్రస్థానం ప్రారంభించారు. సుమారు 500 పైగా శిక్షణలు చేపట్టారు. సుమారు రెండు వేల మందికి పైగా ఆయన వద్ద శిక్షణ పొందారు. 15 మంది శిక్షకులయ్యారు. వారు స్వతహాగా యోగా శిక్షణా కేంద్రాలను నిర్వహిస్తున్నారు. పాఠశాలలు, ప్రైవేటు సంస్థలలో ఉచితంగా కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రస్తుతం నర్సాపూర్‌లో శిక్షణ కేంద్రం నిర్వహిస్తూ, విజన్ వృద్ధాశ్రమం, మద్యానికి బానిసలైన వారి పునరావాస కేంద్రంలో యోగా తరగతులు చేపడుతున్నారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో సారధి పేరుతో ప్రభుత్వ కేంద్రం ఏర్పాటుకు కృషి చేశారు. కపాలబాతి, ప్రాణాయామం వంటి ఆసనాలు వేయించడంలో ప్రత్యేకత చూపుతున్నారు. యోగా సాధనపై ముందుగా అవగాహన కల్పించి ప్రారంభింపచేస్తారు. గురువు సురేందర్ మాట్లాడుతూ.. నిత్య జీవితంలో ప్రతి ఒక్కరికీ యోగా భాగం కావాలని ఆకాంక్షించారు. ఆరోగ్య రక్షణకు ఇది దోహదపడుతుందన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఆకునూరు బాలలు

చేర్యాల, న్యూస్‌టుడే: ఇటీవల సిద్దిపేటలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి యోగా పోటీల్లో చేర్యాల మండలం ఆకునూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం ఆకునూరులో చిన్నారులు ఎం.సాత్విక, సీహెచ్. భార్గవి, వి.శిరీష, టి.దివ్యశ్రీని అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభ చూపి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ప్రధానోపాధ్యాయుడు ఐలయ్య, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎం.కవిత ఆకాంక్షించారు.



విద్యార్థినులతో ప్రధానోపాధ్యాయుడు, వ్యాయామ ఉపాధ్యాయురాలు

చికెన్ ధరలు

ఫాంరేటు	110–00	డ్రెస్డ్	191–00
రిటైల్	132–00	స్కిన్‌లెస్	218–00

రక్తదానం.. పలువురికి ప్రాణదానం



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: రక్తదానం పలువురికి ప్రాణదానమని ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఖేడ్‌లో లయన్స్‌క్లబ్, పట్లోళ్ల కిష్టారెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. మహాత్మాగాంధీ, పట్లోళ్ల కిష్టారెడ్డి జయంతిలను పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. తన తండ్రి కిష్టారెడ్డి ఎమ్మెల్యేగా ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. అనంతరం ప్రాంతీయ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు. డీసీసీ ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాకే గ్రామసభ పెట్టండి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

మనూరు, న్యూస్‌టుడే: గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్థులు పంచాయతీ కార్యదర్శి సురేందర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. గ్రామానికి భగీరథ నీరు రాకపోవడంతో వ్యవసాయ బావుల నుంచి నీరు తెచ్చుకొంటున్నామని వాపోయారు. గ్రామంలో నెలకొన్న పలు సమస్యలు పరిష్కరించాకనే గ్రామసభ పెట్టాలని కోరారు.

'భాజపాపై నమ్మకం పెరిగింది'

న్యాల్‌కల్: తెలంగాణలో భాజపాపై మరింత నమ్మకం పెరిగిందని న్యాల్‌కల్ మండల భాజపా అధ్యక్షుడు ఓంకార్‌యాదవ్ పేర్కొన్నారు. న్యామాతాబాద్‌లో బుధవారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. దేశంకోసం ధర్మంకోసం యువత భాజపాలో చేరాలని కోరారు. మండల కార్యదర్శి మల్లేష్, బూత్ అధ్యక్షులు పాండు పటేల్ పాల్గొన్నారు.

మధ్వార్‌తండాలో భోగ్‌భండార్

నారాయణఖేడ్: మాధ్వార్‌తండాలో బుధవారం భవానీ మాత, సంత్‌సేవాలాల్ మహరాజ్ భోగ్‌భండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. భవానీమాత దీక్షాధారులైన బంజారా సేవాలాల్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌చౌహాన్ పాల్గొని మాట్లాడారు. సేవాలాల్ మహరాజ్ చూపిన బాటలో ప్రతిఒక్కరూ పయనిస్తూ మూఢనమ్మకాలకు దూరం ఉండాలని కోరారు. పూజారి రాములుతోపాటు ఆ సంఘ బాధ్యులైన దీక్షాధారులు రాజునాయక్, లక్ష్మణ్, ప్రేమ్‌సింగ్, పాండునాయక్ పాల్గొన్నారు.

పురపాలికల్లో మొక్కుబడిగా స్వచ్ఛత

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ

పురపాలికల్లో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం ఆశించిన స్థాయిలో అమలు కావడం లేదు. సెప్టెంబరు 17 నుంచి అక్టోబర్ 2 వరకు చేపడుతున్న కార్యక్రమాలు మొక్కుబడిగానే సాగుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా పట్టణాల్లో స్వచ్ఛత లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తిస్థాయిలో నిమగ్నం కావడంలేదు. యువకులు, విద్యార్థులను భాగస్వాములను చేయాల్సిన కార్యక్రమాలను మొక్కుబడిగా నిర్వహిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.



సంగారెడ్డి బొబ్బిలికుంటలో నిలిచిన మురుగు

● పురపాలక సంఘాలు: 8
● వార్డులు: 199

పక్షం రోజుల్లో లక్ష్యం నెరవేరేనా?

జిల్లాలోని 8 పురపాలక సంఘాల్లో 'స్వచ్ఛత హీ సేవ' కార్యక్రమం మొక్కుబడిగా నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు. కాలనీల్లో పర్యటించి తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించడం, ప్లాస్టిక్‌భూతం ఉంచడం, శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించడం తదితరాలు చేపట్టాలి. కాని పురపాలిక అధికారులు మాత్రం కొన్ని పాఠశాలల్లో విద్యార్థులతో ప్రతిజ్ఞలు నిర్వహించి అయిందనిపిస్తున్నారు. ఇందులో ప్రజాప్రతినిధులు, కాలనీ సంఘాలు, ప్రజలను భాగస్వాములు చేయడం లేదు. 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంపై తమకు ఇప్పటి వరకు పురపాలిక అధికారులు ఎలాంటి సమాచారం లేదని సంగారెడ్డికి చెందిన ఓ కౌన్సిలర్ 'న్యూస్‌టుడే'కు తెలపడం గమనార్హం. అన్ని పురపాలికల్లో ఇదే పరిస్థితి ఉంది. మంచి కార్యక్రమం క్షేత్ర స్థాయిలో అమలు చేయాల్సిన ఉండగా... అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా పురపాలికల అధికారులు స్వచ్ఛత కార్యక్రమాలను వేగవంతం చేయాలి.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఫోన్ చేయాల్సిన నంబర్లు (10AM TO 1 PM)
సంగారెడ్డి 8008573233, జహీరాబాద్ 9441648363
నారాయణఖేడ్ 8008573248, నారాయణఖేడ్ టౌన్ 8008573250
అందోలు 8008573241, [illegible] 8008573231

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, జోగిపేట, నారాయణఖేడ్

? సంగారెడ్డిలోని వసంత్ నగర్ కాలనీలో వీధి దీపాలు పూర్తిస్థాయిలో వెలగడం లేదు. రాత్రి సమయంలో బయటకు వచ్చేందుకు ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి. – శివ కుమార్, సంగారెడ్డి

✓ వెంటనే సిబ్బందిని పంపి వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం. – ఇంజినీర్ అహ్మద్, పురపాలక డీఈఈ.

? పోతిరెడ్డిపల్లిలోని శిల్ప వెంచర్‌లో చెత్త సేకరణ సిబ్బంది సరిగా రావడం లేదు. చెత్త ఎక్కడ వేయాలో తెలియక ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి. – వెంకటేశం, సంగారెడ్డి

✓ చెత్త సేకరణ సిబ్బంది క్రమంతప్పకుండా వచ్చేలా సూచనలు చేస్తాం. – సైదులు, పారిశుద్ధ్య పర్యవేక్షకులు.

? జోగిపేట పట్టణంలోని 10వ వార్డులో రెండు రోజులుగా మంజీరా నీరు రావడం లేదు. వార్డులోని ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. -రవి, జోగిపేట.

✓ నీళ్లు రాకపోవడానికి కారణాలు తెలుసుకుని.. సరిచేసి నీటి సరఫరా చేయిస్తాం. -తిరుపతి, పుర కమిషనర్ అందోలు-జోగిపేట.

? జోగిపేట శివారులోని పోసానిపేటకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న విద్యుత్తు స్తంభాలకు అడవి తీగలు పాకుతున్నాయి. వీటి కారణంగా జీవాలు, మనుషులకు ఎర్తింగ్ వచ్చి ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. – ప్రభాకర్, జోగిపేట.

✓ విద్యుత్తు స్తంభాలకు పాకిన తీగలు తొలగించి ప్రమాదాలు జరగకుండా చూస్తాం. –శ్రీనివాస్, ఏఈ విద్యుత్తు శాఖ అందోలు.

? ఖేడ్ పట్టణంలోని రాజీవ్ కూడలి సమీపం నుంచి రాంవిలాస్ గల్లీలోకి వెళ్లే దారిలో తారు రోడ్డుకు, సీసీ రోడ్డుకు మధ్య గొయ్యి ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. – వెంకట్, ఖేడ్.

✓ గొయ్యి పూడ్చి ప్రమాదాలు నివారిస్తాం. – జగ్జీవన్, కమిషనరు, ఖేడ్ పురపాలిక.

బతుకమ్మ సంబురం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలు తయారుచేసి ప్రధాన కూడళ్ల వద్ద ఉంచి ఆటపాటలతో సంబురాలు నిర్వహించారు. తరువాత చెరువుల్లో నిమజ్జనం చేశారు. – న్యూస్‌టుడే, బృందం.



కానుకుంటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ఐడీఏ బొల్లారంలో..



జహీరాబాద్‌లో..



మనూరు మండలం బోరంచలో...

'దళితులపై దాడులు సరికాదు'

హత్నూర: దళితులపైన దాడులు పెరుగుతున్నా.. అధికారులు బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆరోపించారు. దౌల్తాబాద్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడారు. కౌడిపల్లి మండలం కూకట్లపల్లిలో మహిళపై దాడిలో కేసులు నమోదు చేయాలన్నారు. బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి శాంతికుమార్,ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రసాద్, డప్పు సత్యం, మాల మహానాడు మండలాధ్యక్షులు రాజీవ్‌గాంధీ, సామెల్ పాల్గొన్నారు.

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు



గాంధీచౌక్ వద్ద ఏర్పాటు చేసిన మండపం

సదాశివపేట, జిన్నారం: విజయదశమి వేడుకలు పురస్కరించుకుని జైభవాని యూత్ అసోసియేషన్ అధ్వర్యంలో సదాశివపేటలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు పేటలో ఏర్పాట్లు చేస్తున్నారు. గాంధీచౌక్ వద్ద సుమారు రూ.2.50 లక్షలతో ప్రత్యేకంగా మండపాన్ని ఏర్పాటు చేశారు. దశాబ్ద కాలంగా చౌడేశ్వర మందిర వద్ద మండపం ఏర్పాటు చేసి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. గురువారం మండపాల్లో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. ● ఐడీఏ బొల్లారం పట్టణంలోని భవాని శంకరసాయి సన్నిధిలో ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ ఛైర్మన్ బాల్‌రెడ్డి, ఆలయ ప్రధాన పూజారి నాగార్జునాచార్యులు పేర్కొన్నారు. గురువారం బాలత్రిపురసుందరీ దేవీ అలంకరణతో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు.

గోవులకు పూజలు

జోగిపేట టౌన్: పట్టణంలోని శ్రీకృష్ణ గోశాలలో బుధవారం పెద్దల అమావాస్యను పురస్కరించుకుని గోపూజ నిర్వహించారు. వాటికి నూతన వస్త్రాలు అలంకరింపజేసి గ్రాసం అందించారు. ఈ కార్యక్రమంలో గోశాల సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఊరూరా గ్రామసభలు



ఖేడ్‌లో ప్రశంసా పత్రాలతో కార్మికులు..



జహీరాబాద్‌లో సన్మానం...

నారాయణఖేడ్: స్వచ్ఛతాహీసేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం కమిషనర్ జగ్జీవన్, ఛైర్మన్ ఆనంద్‌స్వరూప్‌షెట్కార్, ఉప ఛైర్మన్ దారం శంకర్ సన్మానించి అవార్డులు అందజేశారు. కోర్టు కాలనీలో మాస్‌క్లీనింగ్ పేరిట శుభ్రత పనులు చేపట్టి మొక్కలు నాటారు. పారిశుద్ధ్య విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, కౌన్సిలర్లు వివేకానంద్, మాజీద్, రాజేష్‌చౌహాన్, రామకృష్ణ, హనుమాండ్లు, వార్డుల అధికారులు పాల్గొన్నారు.

జహీరాబాద్: మొగుడంపల్లి మండలం ధనసిరి పాఠశాలకు చెందిన ఉపాధ్యాయ దంపతులు మల్లయ్యస్వామి, నాగలక్ష్మిలు 11 మంది కార్మికులను సన్మానించారు. మాజీ సర్పంచి డీసీసీబీ ఉపాధ్యక్షుడు మల్లికార్జున్‌రెడ్డి, భాజపా అసెంబ్లీ కన్వీనర్ జగన్నాథ్, కార్యదర్శి నాగభూషణం పాల్గొన్నారు.

హత్నూర, కోహీర్: స్వచ్ఛత హీ కార్యక్రమాలు బుధవారం అట్టహాసంగా సాగాయి. లింగాపూర్‌లో నిర్వహించిన గ్రామ సభలో ఎంపీడీవో శంకర్, చీక్ మద్దూర్‌లో ఎంపీవో యూసుఫ్ పాల్గొన్నారు ● కోహీర్‌లోని అన్ని గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో సమస్యలు.. పరిష్కార మార్గాలు, అభివృద్ధి తదితరాలపై ప్రణాళికల్లో చర్చించారు.

గుమ్మడిదల: గ్రామాల్లో పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని గుమ్మడిదల గ్రామసభలో ఎంపీడీఓ ఉమాదేవి తెలిపారు. ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో గ్రామసభలు కొనసాగాయి.

మొగుడంపల్లిలో భారీ వర్షం

మొగుడంపల్లి(జహీరాబాద్ అర్బన్), న్యూస్‌టుడే: మొగుడంపల్లి, జహీరాబాద్ మండలాల్లో మంగళ, బుధవారాల్లో భారీ వర్షం కురిసింది. మొగుడంపల్లిలో అత్యధికంగా 10 సె.మీ వర్షపాతం నమోదైంది. భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. కుండపోత వానతో చెరుకు, అల్లం, కంది పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచింది.

వైద్యవిద్య ప్రవేశాల్లో విద్యార్థినుల ప్రతిభ

జహీరాబాద్ అర్బన్: జహీరాబాద్ మండలం బూచినెల్లి మైనార్టీ గురుకుల బాలికల కళాశాలకు చెందిన ఏడుగురు విద్యార్థినులు మెడికల్ కళాశాల్లో సీట్లు సాధించారని ప్రిన్స్‌పల్ రూబీనాబేగం పేర్కొన్నారు. మొదటి విడత కౌన్సిలింగ్‌లో బి.గాయత్రి(ఉస్మానియా మెడికల్ కళాశాల), రేబాఫాతిమా(ప్రభుత్వ మెడికల్ కళాశాల నల్గొండ), జువేరియా వసీమ్(ప్రభుత్వ మెడికల్ కళాశాల కరీంనగర్), తస్నియా తస్నీమ్(ప్రభుత్వ మెడికల్ కళాశాల వనపర్తి), ఫాతిమా సానియా(ప్రభుత్వ మెడికల్ కళాశాల భద్రాది కొత్తగూడెం),షాయిస్తా ఫాతిమా(అయాన్ మెడికల్ కళాశాల మొయినాబాద్), నందిని(పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల చెవేళ్ల)లో సీట్లు పొందినట్లు పేర్కొన్నారు. కళాశాలలో కొనసాగుతున్న నీట్(సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్)లో వీరు శిక్షణ పొందరన్నారు.

గాంధీ ఆశయాలు అనుసరణీయం



జహీరాబాద్‌లో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం కూడళ్లలోని విగ్రహాల వద్ద వివిధ సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు నివాళి అర్పించారు. అహింసావాది గాంధీజీ అని కొనియాడారు. సత్యాగ్రహమే ఆయుధంగా పోరాడి భారతీయులకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాన్ని అందించిన జాతిపిత అని పేర్కొన్నారు.

–న్యూస్‌టుడే బృందం.



అబ్బెందలో జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ తదితరులు



జోగిపేట: దారి శుభ్రం చేస్తున్న పుర అధ్యక్షుడు మల్లయ్య



సదాశివపేటలో పుర అధ్యక్షురాలు అపర్ణపాటిల్...



జోగిపేటలో మాజీ ఏఎంసీలు మల్లికార్జున్, డీబీ నాగభూషణం

ఖాజీపల్లిని రక్షించాలని తీర్మానం

జిన్నారం, న్యూస్‌టుడే: ఖాజీపల్లి శివారులోని గండిచెరువు ఎఫ్‌టీఎల్ తగ్గించాలని గ్రామసభ ఏకగ్రీవ తీర్మానం చేసింది. బుధవారం ఆర్‌కె ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెరువు పరిస్థితిపై నిర్వహించిన గ్రామసభలో పలువురు మాట్లాడారు. చెరువు అలుగు ఎత్తు పెంచటం వల్ల పంట పొలాలు మునిగిపోతున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ సమస్యను రెవెన్యూ, నీటిపారుదల శాఖల దృష్టికి తెచ్చి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి సత్యనారాయణ, ఆకుల నవీన్, ఫౌండేషన్ అధ్యక్షుడు రమాకాంత్ పాల్గొన్నారు.

వర్ణ రహిత సమాజానికి పోరాటం: కేవీపీఎస్

సంగారెడ్డి మున్సిపాలిటీ: వర్ణ రహిత సమాజం కోసం పోరాటం చేద్దామని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్ పేర్కొన్నారు. బుధవారం కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక సుందరయ్య భవన్ వద్ద జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, ఉపాధ్యక్షుడు శివకుమార్, సహాయ కార్యదర్శులు ప్రవీణ్‌దాస్, జిల్లా కమిటీ సభ్యులు దత్తు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి

నారాయణఖేడ్:వెంకటాపూర్‌తండాకు చెందిన శతాధిక వృద్ధురాలు క్ర జగిని బాయి(110) బుధవారం మృతిచెందారు. కొద్దిరోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడున్నారు. తండావాసులు ఘన నివాళులు అర్పించారు.

ఎల్‌ఆర్‌ఎస్ విషయంలో మోసం: భారాస

జహీరాబాద్: ఎల్‌ఆర్‌ఎస్ విషయంలో ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని భారాస సీనియర్ నాయకుడు నామా రవికిరణ్ పేర్కొన్నారు. పార్టీ నాయకులతో కలిసి బుధవారం జహీరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో విఫలమైన ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌పైన మాట మార్చిందన్నారు. ఈ సమావేశంలో పార్టీ నియోజకవర్గం ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మోహన్, పట్టణ మాజీ అధ్యక్షుడు యాకూబ్, మాజీ కౌన్సిలర్ అబ్దుల్లా పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

నారాయణఖేడ్: అనారోగ్యంతో చికిత్స పొందిన ఖేడ్ మండలం జగన్నాథ్‌పూర్‌కు చెందిన పోచమ్మ కుటుంబ సభ్యులకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.14 వేలు చెక్కును ఖేడ్ భారాస కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అందజేశారు. పురపాలిక మాజీ ఉపఛైర్మన్ పరశురాం, మాజీ ఎంపీటీసీ ముజమ్మిల్, పట్టణ భారాస అధ్యక్షుడు నగేష్ పాల్గొన్నారు.

కల్హేర్, న్యూస్‌టుడే: నిజాంపేట్ మండలం మునిగేపల్లికి చెందిన జింకల బాలవ్వ అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చేరి చికిత్స చేయించుకుంది. సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.28,500 చెక్కు మంజూరు కాగా మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి బుధవారం బాలవ్వకు ఆమె స్వగ్రామంలో అందజేశారు. నాయకులు నవాబ్‌పటేల్, జగదీశ్వరచారి, అశోక్, శేఖర్ తదితరులున్నారు.

ఘనంగా లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి



రోటరీ క్లబ్ ప్రతినిధులు నివాళి

జహీరాబాద్: రోటరీక్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సభ్యులు ఆయన చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. క్లబ్ మాజీ అసిస్టెంట్ గవర్నర్లు సంగమేశ్వర్, మహిపాల్ రెడ్డి, అధ్యక్షుడు లాల్‌రెడ్డి, కార్యదర్శి రఘునందన్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు సంగ్రామ్‌పాటిల్, నాగభూషణమ్, నోయల్, వెంకటేశం, సిద్దన్న పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

జహీరాబాద్ అర్బన్(న్యాల్‌కల్), న్యూస్‌టుడే: వడ్డిలో బుధవారం విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైంది. దసరా వేడుకలకు ఇంటిని శుభ్రం చేసి తడి దుస్తులు ఆరబెడుతుండగా విద్యుదాఘాతంతో మంటలు చెలరేగాయి. ప్రమాదంలో దుస్తులు, నిత్యావసర సామగ్రి, ఎలక్ట్రానిక్ వస్తువులు బూడిదయ్యాయి. ప్రమాద సమయంలో యజమాని కాశీనాథ్ దంపతులు ఇంట్లో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరారు.

రైతన్నలకు అన్నీ కష్టాలే!

పంటలకు నష్టం కలిగిస్తున్న జంతువులు

నారాయణఖేడ్ టౌన్, న్యూస్‌టుడే: కీలకదశలో ఉన్న పంటలపై అడవి పందులు, జింకలు దాడులు చేస్తుండగా రైతుల ఆశలు తుంచి వేసినట్లవుతోంది. చేతికందే దశలో అడివి జంతువులు కలిగిస్తున్న నష్టంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధిక వర్షాలతో సతమతమవుతున్న రైతన్నలకు ఇదోక అదనపు నష్టం కానుంది. జిల్లాలో 3.36 లక్షల ఎకరాల్లో పత్తి, 22 వేల ఎకరాల్లో చెరకు పంటలు సాగయ్యాయి. కంది, మొక్కజొన్న, జొన్న 92 వేల ఎకరాల్లో సాగైంది. ప్రస్తుతం పత్తి, చెరకు కీలక దశలో ఉన్న తరుణంలో అడవి పందుల బెడద పెరిగింది.



కరస్‌గుత్తి- నాగల్‌గిద్ద దారిలో చీరలు చుట్టి పంట రక్షణ ఏర్పాట్లు...

రాత్రుల్లు స్వైరవిహారం

20 రోజులుగా అడవి పందులు చేలల్లో స్వైరవిహారం చేస్తున్నాయి. పత్తి, చెరకు పంటలపై దాడులు చేసి నేలమట్టం చేస్తున్నాయి. గుంపులుగా వస్తున్న పందులు రాత్రంతా చేలలోనే ఉంటూ పంటకు నష్టం కలిగిస్తున్నాయి. రైతులు కాపలా ఉన్నా.. ఏదో మూలకు నష్టం చేస్తున్నాయి. పందులు దాడి చేసే అవకాశం ఉండడంతో రైతులు రాత్రివేళ వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లడానికి జంకుతున్నారు. మనూరు మండలం రాణాపూర్‌లో రైతు రాజుకు చెందిన అర ఎకరం పత్తి పంట దెబ్బతినగా ఏమి చేయాలో తెలియక అయోమయం చెందుతున్నారు. చేల చుట్టూ చీరలు కడితే వాటిని చూసి అడవి పందుల బెదిరిపోతాయనే రైతులంతా అదే పద్ధతి పాటిస్తున్నారు. కరస్‌గుత్తి-నాగల్‌గిద్ద రహదారి పక్కన ఎక్కడ చూసినా వ్యవసాయ క్షేత్రాల చుట్టూ చీరలు దర్శనమిస్తున్నాయి.

నివారణ ఇలా చేయాలి:

పందుల బెడదను నివారించేందుకు అనేక మార్గాలు ఉన్నాయి. వ్యవసాయ క్షేత్రం చుట్టూ రెండు అడుగుల లోతు, వెడల్పుతో కందకం తవ్వడం ద్వారా పందుల బెడదను నివారించవచ్చు. 200 గ్రాములు ఫోరెట్ గుళికలను కిలో ఇసుకలో కలిపి గుడ్డలో కట్టి పంట చేలలో మూడు మీటర్ల దూరం ఎడమలో 100 సెంటి మీటర్ల ఎత్తులో కర్రలకు కట్టాలి. ఘాటైన మందు వాసనకు అవి దూరంగా వెళ్తాయి.

– మహేష్ చౌహాన్, ఏవో మనూరు.

పర్యావరణ పరిరక్షణకు కృషి: డీఎస్పీ



మొక్కలు నాటిన డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి పోలీసు సిబ్బంది

ఝరాసంగం: పర్యావరణాన్ని పరిరక్షిస్తూ నాటిన మొక్కలు ఏపుగా పెంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఝరాసంగంపోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి మాట్లాడారు. అదేవిధంగా వివిధ గ్రామాల్లో గాంధీ జయంతి వేడుకలు జరిగాయి. పాలిథిన్ సంచుల నిషేధంపై విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్, రూరల్ సీఐ హన్మంతు, ఎస్సై నరేశ్, ఏపీవో రాజ్‌కుమార్, కార్యదర్శి సరస్వతి, వార్డెన్లు వెంకటేశం, శారద, మాజీ సర్పంచి పెంటయ్య పాల్గొన్నారు.

మంత్రికి జగ్గారెడ్డి పరామర్శ

సంగారెడ్డి అర్బన్: రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తంరెడ్డి ఇటీవల మరణించారు. పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి బుధవారం మంత్రిని పరామర్శించారు.